14న ఐటీఐ అప్రంటీస్ మేళా

విజయనగరం దాసన్నపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వీటి అగ్రహారంలో ఉన్న ప్రభుత్వం ఐటీఐ కళాశాలలో ఈనెల 14న ఉదయం 9 గంటల నుంచి ప్రధానమంత్రి నేషనల్ అప్రంటీస్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ టీవీ గిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులు పాల్గొనవచ్చునని, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఈస్టుకోస్టు రైల్వేతో పాటు ప్రైవేటు రంగానికి చెందిన జయభేరీ, వరుణ్ ఆటోమొబైల్స్, భగవతి ప్రైవేటు లిమిటెడ్ వంటి ప్రైవేటు కంపెనీలకు కూడా అప్రంటీస్ మేళా జరుగుతుందన్నారు.

డ్రోన్ చూస్తోంది


ట్రాఫిక్ నియంత్రణలో డ్రోన్ల సహకారం


నగరశివార్లలో పేకాట స్థావరాలపై డ్రోన్‌తో గుర్తింపు

- నిఘా కోసం జిల్లా పోలీసుల ప్రయోగం
- ఐదు ప్రధాన కేంద్రాల్లో వినియోగం
- ఇప్పటికే అనేక కేసుల నమోదు
- నిరంతరం పర్యవేక్షణ
- చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం

విజయనగరం క్రైం, జూలై8 (ఆంధ్రజ్యోతి)

దొంగతనాలు.. గంజాయి సేవించడం.. చైన్ స్నాచింగ్.. ఆరుబయట స్థలాల్లో మద్యం తాగడం.. పేకాట ఆడటం.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం.. తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని పోలీసులు ఇట్టే పట్టేస్తున్నారు. గతంలో పోలీసులు కిలోమీటరు దూరంలో ఉన్నప్పుడే అప్రమత్తమై పారిపోయేవారు. నేడు అలా కుదరదు. వారు రాకముందే డ్రోన్ వస్తుంది.. గుట్టుగా ఫొటోలు తీసి పంపిస్తుంది. ఆ తర్వాత పారిపోవడానికి ప్రయత్నించినా ఫొటోల ఆధారంగా పట్టుబడుతున్నారు. డ్రోన్ కెమెరాలు వచ్చాక చట్ట వ్యవతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇటీవల కాలంలో డ్రోన్ ద్వారా పట్టుకున్న కేసులే జిల్లాలో ఎక్కువగా నమోదవుతున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసు శాఖ సాంకేతిక పరిజ్ఞానం సాయంతో (మిగతా 8వ పేజీలో..)

డ్రోన్లతో ఇటీవల ఛేదించిన కేసులు..

పేకాట శిబిరాలు	8
కోడిపందేలు	2
డిక్కీ గేమ్	1
ఛార్ట్ గేమ్	1
బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవనం	71

వైఎస్సార్ జయంతి నుంచైనా మంచి పనులు చేయండి

- నెల్లూరు మాజీ ఎమ్మెల్యేను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి
- మీడియా సమావేశంలో హోంశాఖ మంత్రి అనిత

బొబ్బిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ తన తండ్రి వైఎస్సార్ జయంతి నుంచైనా మంచి పనులకు శ్రీకారం చుట్టాలని హోంమంత్రి వంగలపూడి అనిత హితవు పలికారు. మహిళా ఎమ్మెల్యే పట్ల దారుణమైన వ్యాఖ్యలు చేసిన నల్లపరెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం ఆమె బొబ్బిలి వచ్చారు. స్థానిక కోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ డీఎన్‌ఏలోనే అసభ్యత, కుసంస్కారం, అనైతికత ఉన్నాయని ధ్వజమెత్తారు. తండ్రి వైఎస్సార్ జయంతి నుంచైనా జగన్ మంచి పనులకు శ్రీకారం చుట్టాలన్నారు. మహిళా ఎమ్మెల్యే పట్ల దారుణమైన వ్యాఖ్యలు చేసిన నల్లపరెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. అసభ్య పదజాలంతో రెచ్చిపోయే వైసీపీ నాయకులను జగన్ ఎందుకు కట్టడి చేయడం లేదన్నారు. 'ఆ పార్టీ తీరుచూస్తుంటే మాకే సిగ్గేస్తోందని, ఇదే మీ నాయకత్వ లక్షణమా? అని' ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే మాటల వీడియోలను నల్లపరెడ్డి తల్లి, అక్క, చెల్లి, భార్య ఇతర ఆడపడుచులకు చూపించాలని, మంచి వ్యక్తిత్వం కలిగిన మహిళా వైసీపీ నాయకురాళ్లకు చూపించాలని కోరారు. నల్లపరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, వైసీపీ నుంచి అతడిని తక్షణం సస్పెండ్ చేసి జగన్ తన నిజాయితీని చాటుకోవాలన్నారు. గంజాయి, డ్రగ్స్ అక్రమ వ్యాపారాలకు (మిగతా 8వ పేజీలో..)


మాట్లాడుతున్న హోంమంత్రి అనిత, పక్కన ఎమ్మెల్యే బేబీనాయన, డీసీసీబీ చైర్మన్ నాగార్జున

మినీ అంగన్వాడీలకు మహర్దశ

- మెయిన్ అంగన్వాడీలుగా అప్‌గ్రేడ్
- కేంద్రాలకు ఆయాల నియామకం
- త్వరలో నోటిఫికేషన్
- ప్రకటించిన మంత్రి సంధ్యారాణి
- జిల్లాలో 293 అంగన్వాడీ కార్యకర్తలకు పదోన్నతి



రాజాం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మినీ అంగన్వాడీ కేంద్రాలకు మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా హోదా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయి. మెయిన్ అంగన్వాడీ కార్యకర్తగా పదోన్నతి కల్పించడంతో పాటు ఆయా కేంద్రాలకు ఆయాల నియామకం కూడా చేపడతామని, త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఇటీవల ప్రకటించారు. తాజా పరిణామంతో ఏళ్లుగా మెయిన్ అంగన్వాడీ కేంద్రాల్లో ఆయాకు చెల్లించే కనీస వేతనంతో నెట్టుకువస్తున్న మినీ అంగన్వాడీ కార్యకర్తలకు పదోన్నతి దక్కనుంది. మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మారనున్నాయి. జీతంతో పాటు మరిన్ని సౌకర్యాలు చేకూరనున్నాయి. కేంద్రాలకు ఆయాలను సైతం ప్రభుత్వం నియమించనుంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జిల్లాలో 293 మంది మినీ (మిగతా 8వ పేజీలో..)



కస్తూర్బా పాఠశాలలో మళ్లీ అగ్ని ప్రమాదం

- పుస్తకాలు, బెంచీలు దగ్ధం

కొత్తవలస, జూలై 8(ఆంధ్రజ్యోతి) : తుమ్మికాపల్లి కస్తూర్బా బాలికల పాఠశాలలో మంగళవారం రాత్రి మరోసారి అగ్నిప్రమాదం సంభవించింది. ఈసారి గ్రౌండ్‌ఫ్లోరులోని ఇంటర్ మొదటి సంవత్సరం తరగతి గదిలో చోటుచేసుకుంది. ఈప్రమాదంలో గది మొత్తం కాలిపోయింది. విద్యార్థినుల పుస్తకాలు, కూర్చునే బెంచీలు, 16 వరకు పరుపులు బూడిదయ్యాయి. ఇదే పాఠశాలలో సుమారు 20రోజుల కిందటే అగ్నిప్రమాదం జరిగి 280 పరుపులు కాలిపోయిన ఘటన మరువకముందే మళ్లీ (మిగతా 8వ పేజీలో..)



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక యంత్రం

కువైట్ పిలుస్తోంది
- నిర్మాణ రంగంలో ఉద్యోగావకాశాలు
- రెండేళ్లకు కాంట్రాక్ట్
- ఆకర్షణీయమైన వేతనాలు
- ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రిజిస్ట్రేషన్

6లో

విద్యార్థులకు తోడుగా ఆర్టీసీ
- పల్లెవెలుగు బస్సులకు ఉచిత, రాయితీ పాసులు

6లో

నాడు రాజులకు.. నేడు ప్రజలకు
దర్బార్ మహల్
విన్నపాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

6లో

మత్తు పదార్థాల స్వాధీనం
- జిల్లాలో ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ పేరుతో తనిఖీలు

7లో

డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా సావిత్రి

7లో

పీఏసీఎస్‌లకు త్రీమ్యాన్ కమిటీలు

- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- త్వరలో బాధ్యతల స్వీకరణ

విజయనగరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్)లకు త్రీమ్యాన్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి పీఏసీఎస్‌కి ముగ్గురు సభ్యులను నియమించింది. ఈ సభ్యుల్లో ఒకరు చైర్మన్ కాగా ఇద్దరు సభ్యులుంటారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల పరిధిలో 94 వ్యవసాయ పరపతి సంఘాలకు కమిటీలు ఏర్పాటయ్యాయి. ఇప్పటికే జిల్లా కేంద్రసహకార బ్యాంకుకు పర్సన్ ఇన్‌చార్జిగా కిమిడి నాగార్జున నియమితు లయ్యారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు త్రీమ్యాన్ కమిటీల ఏర్పాటుతో గ్రామాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులకు మరో దఫా పదవుల పంపకం చేపట్టినట్టయ్యింది. దాదాపు పదేళ్లుగా పీఏసీఎస్‌లకు, అదే విధంగా డీసీసీబీకి ఎన్నికలు జరగలేదు. ప్రభుత్వ తాజా ఉత్తర్వుల ప్రకారం ఎన్నికలు జరిగే వరకూ వీరు సభ్యులుగా ఉంటారు. ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలా? లేదా అన్నది ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. అయితే సహకార సంఘాల్లో చైర్మన్, సభ్యులు లేకపోవడం వల్ల కార్యకలాపాలు మందగిస్తున్నాయని ప్రభుత్వం భావించి త్రీమ్యాన్ కమిటీలను నియమించింది.



- ఉమ్మడి జిల్లాలోని 94 వ్యవసాయ పరపతి సంఘాలకు త్రీమ్యాన్ కమిటీలను నియమించారు. ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు సూచనలతో వీరిని ఎంపిక చేశారు. ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేయడంతో పీఏసీఎస్‌ల చైర్మన్‌లు, సభ్యులు ఈ నెల 10 నుంచి బాధ్యతలు చేపట్టేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

తప్పుడు నివేదికలిస్తే చర్యలు

- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి జీవనరాణి

గజపతినగరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): రోగ నిర్ధారణకు సంబంధించి ప్రైవేటు ల్యాబ్‌లు తప్పుడు నివేదికలు అందినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్.జీవనరాణి స్పష్టంచేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వర్షాకాలం కారణంగా జ్వరాలు వచ్చే పరిస్థితి ఉందని, ప్రైవేటు ల్యాబ్‌లకు వచ్చే రోగులకు మలేరియా, డయేరియా తదితర వ్యాధులపై రోగులకు సమగ్ర రిపోర్టు ఇవ్వాలని, తప్పుడు నివేదికలు ఇస్తే ఊరుకునేది లేదన్నారు. ప్రైవేటు ల్యాబ్‌లపై అధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉన్నారని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు వైద్య సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. మరుపల్లి గ్రామానికి చెందిన ప్రైవేటు కళాశాలకు చెందిన 12మంది విద్యార్థులు సోమవారం రాత్రి ఏరియా ఆసుపత్రిలో చేరారు. ఈ నేపథ్యంలో కళాశాలలో మౌలిక వసతులపై విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. మెంటాడ మండలం మెంటాడ, చల్లపేట గ్రామాలకు చెందిన రోగుల పరిస్థితి ఎలా ఉందని ఆరా తీశారు. వర్షాకాలం కావడంతో వైద్యాధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆమె వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ జగదీష్, జిల్లా వ్యాధుల పర్యవేక్షణాదికారి కేవీఎస్ సత్యన్నారాయణ, హెల్త్ అసిస్టెంట్ జె.సత్తిరాజు తదితరులు ఉన్నారు.


వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

పశువైద్య కళాశాల విద్యార్థులకు తీపికబురు

- 3, 4 సంవత్సరాల తరగతులకు లభించిన గుర్తింపు
- ఫలించిన విద్యార్థుల పోరాటం
- త్వరలో కళాశాలకు అందనున్న ఉత్తర్వులు

గరివిడి, జూలై 8(ఆంధ్రజ్యోతి): గరివిడి పశువైద్య కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు కేంద్రం తీపికబురు చెప్పింది. ఈ కళాశాలలో ప్రస్తుతం డీవీఎస్‌ఈ 3,4 సంవత్సరాలు చదువుతున్న విద్యార్థుల ప్రవేశాలకు గుర్తింపు ప్రకటించింది. దీంతో విద్యార్థుల పోరాటం ఫలించినట్లయింది. అయితే కళాశాలకు ఇంకా అధికారికంగా ఉత్తర్వులు రాలేదు. త్వరలో వచ్చే అవకాశం ఉంది.

గరివిడి పశువైద్య కళాశాలలో 2022-23, 20023-24 విద్యా సంవత్సరాల్లో ప్రవేశాలు పొంది కళాశాలలో చదువుతున్న 220 మంది విద్యార్థులు ఇంతవరకూ అయోమయంలో ఉన్నారు. తమ తరగతులకు కేంద్రం నుంచి అనుమతి రాలేదు. దీనివల్ల ఇతరత్రా సౌకర్యాలు పొందే అవకాశం లేదు. దీనిపై కొన్నాళ్లుగా వారు ఆందోళన చేస్తున్నారు. 3, 4 సంవత్సరాల తరగతులకు అనుమతులు ఇవ్వాలని, స్టైఫండ్ కూడా పెంచాలని 45 రోజులుగా గరివిడిలో తరగతులు బహిష్కరించి వివిధ రూపాల్లో ఆందోళన చేశారు. ఈ పోరాటంలో భాగంగా చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు వద్దకు వెళ్లి వినపతిపత్రాన్ని (మిగతా 8వ పేజీలో..)



నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు(ఫైల్)

వేతన యాతన


నిరసన వ్యక్తం చేస్తున్న క్షేత్ర సహాయకులు (ఫైల్)

- ఉపాధి హామీ క్షేత్ర సహాయకుల జీతాలు నిలిపివేత
- జిల్లా వ్యాప్తంగా 275 మంది బాధితులు
- ఫాంపాండ్స్ పూర్తి చేయలేదనే...

విజయనగరం కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు ఉపాధి పనులు చూపించే క్షేత్ర సహాయకులు జీతాల కోసం పోరుబాట పట్టారు. మూడు నెలలుగా వేతనాలు అందక ఆందోళన చెందుతున్నారు. ఫాంపాండ్స్ పూర్తి చేయలేదన్న కారణంతో ఉన్నతాధికారులు వారి జీతాలను నిలిపివేశారు. ఆకలిమంటలతో అలమటిస్తున్న వారు తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

భూగర్భ జలాలు పెంపొందించడానికి ఫాంపాండ్ తవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి పంచాయతీ పరిధిలో 25 ఫాంపాండ్స్ తవ్వాలని ఉన్నతాధికారులు లక్ష్యాలు విధించారు. జిల్లా వ్యాప్తంగా 776 పంచాయతీల్లో 11,220 ఫాంపాండ్స్ తవ్వాలని నిర్దేశించారు. వీటిలో 10,156 ఫాంపాండ్‌లు తవ్వడానికి పనులు మంజూరు చేశారు. ఒక్క ఫామ్‌పాండ్ తవ్వడానికి 9 మీటర్ల పొడువు, 9 మీటర్ల వెడల్పు స్థలం ఉండాలి. ఇందులో నాలుగు స్టెప్‌లు ఉంటాయి. ప్రతి అరమీటరుకు ఒక స్టెప్ చొప్పున తవ్వాలి. తరువాత అవుట్‌లెట్.. ఇన్‌లెట్ తవ్వాలి. ఇదిలా ఉండగా జిల్లాలో 5,353 ఫామ్‌పాండ్స్ ప్రగతిలో ఉన్నాయి. నాలుగు స్టెప్‌లు తవ్వినవి 2552 ఉన్నాయి. వీటిల్లోనే (మిగతా 8వ పేజీలో..)


గంట్యాడలో ఫాంపాండ్ తవ్వాల్సిన చోట వర్షం నీరు చేరిన దృశ్యం

కువైట్ పిలుస్తోంది

- నిర్మాణ రంగంలో యువతకు ఉద్యోగావకాశాలు
- రెండేళ్లకు కాంట్రాక్ట్ ● ఆకర్షణీయమైన వేతనాలు
- ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రిజిస్ట్రేషన్



రాజాం రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతను కువైట్ ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. అక్కడ నిర్మాణ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు వీలుగా ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఐటీఐ, డిప్లమో, సమాన అర్హత కలిగిన ఆసక్తి గల యువకులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈనెల 12 వరకు గడువు విధించింది.

ఇవీ నిబంధనలు..

25 నుంచి 50 ఏళ్లలోపు వయసు కలిగిన వారు, కువైట్‌లో రెండేళ్ల పాటు వారానికి ఆరు రోజుల వంతున రోజుకి తొమ్మిది గంటల చొప్పున పని చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు అర్హులు. వీరు ఇంగ్లీషు, హిందీ మాట్లాడ గలిగి ఉండాలి. ఇంటర్వ్యూ, టెక్నికల్ స్కిల్స్ ఆధారంగా నియామక ప్రక్రియ జరుగుతుంది. మూడు నుంచి అయిదేళ్ల పాటు అనుభవం ఉన్న వారికి ఉచిత వసతి, రవాణా సదుపాయం కల్పిస్తారు. వైద్య సౌకర్యంతో పాటు వీసా ప్రాసెసింగ్ ఖర్చులు, విమాన టిక్కెట్లను నిర్మాణ సంస్థలే భరిస్తాయి

ఏమేం కావాలంటే...

ఉద్యోగార్థులకు పాస్‌పోర్ట్, అనుభవానికి సంబంధించిన సర్టిఫికెట్, విద్యార్హతల సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. అన్ని అర్హతలు ఉండి... ఆసక్తి ఉన్న నిరుద్యోగులు 99888 53335, 87126 55686, 87901 18349 నెంబర్లలో సంప్రదించాలి.

ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఉద్యోగాలు..



కువైట్‌లో ఉద్యోగం అంటే యువత భయపడాల్సిన పనిలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కువైట్‌లోని కంపెనీలతో ఎం.ఒ.యు. కుదుర్చుకుంది. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అర్హులైన నిరుద్యోగ యువతకు అక్కడ ఉపాధి కల్పించనున్నారు. అర్హత కలిగిన యువత ఎలాంటి అపోహలకు ఆస్కారం లేకుండా ఈనెల 12లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చును.

-జి.ప్రశాంత్‌కుమార్, జిల్లా నైపుణ్యాధికారి, విజయనగరం

ఉద్యోగాలివే...

ఉద్యోగం	సూపర్‌వైజర్ వేతనం (సుమారుగా)	వర్కర్ వేతనం (సుమారుగా) (ఇండియన్ కరెన్సీ ప్రకారం)
సిరామిక్ ఫ్లోరింగ్	రూ.70,000	రూ.56,000
పెయింటింగ్	రూ.70,000	రూ.56,000
ఎలక్ట్రికల్	రూ.70,000	రూ.56,000
సీలింగ్	రూ.70,000	రూ.56,000

విద్యార్థులకు తోడుగా ఆర్టీసీ

- పల్లెవెలుగు బస్సులకు ఉచిత, రాయితీ పాసులు

విజయనగరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలలు తెరుచుకున్నాయి. పట్టణాల్లోని విద్యాసంస్థలకు వెళ్లేందుకు గ్రామీణ ప్రాంత పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రయాణ ఖర్చు భారంగా మారుతోంది. అటువంటి విద్యార్థులకు ఏపీఎస్ ఆర్టీసీ అందిస్తున్న రాయితీ పాసులు వరంగా మారాయి. పదో తరగతి లోపు చదువుతున్న విద్యార్థినులు, 12 సంవత్సరాల లోపు విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ ఇతర కోర్సులు చదువుకుంటున్న విద్యార్థులకు రాయితీ పాసులు ఇస్తున్నారు. రాయితీ పాసులు పొంది ప్రయాణిస్తున్న విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి ఏటా నగదు చెల్లిస్తుంది.

దరఖాస్తు ఇలా...

ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుల్లో ఉచిత, రాయితీతో ప్రయాణించాలంటే విద్యార్థులు ముందుగా పాసులు పొందాలి. సంబంధిత ఆర్టీసీ బస్సు పాస్ కౌంటర్లలో వాటిని జారీ చేస్తారు. ఉచిత పాసులు పొందాలనుకునే వారు ఆధార్ కార్డు, పాఠశాలలో హెచ్‌ఎం ఇచ్చే స్టడీ సర్టిఫికెట్‌తో కౌంటర్ వద్దకు వెళ్లాలి. రాయితీ పాసులకు ఇంటర్ విద్యార్థులు ఆధార్ కార్డు, పదో తరగతి హాల్ టిక్కెట్‌ను దరఖాస్తుతో పాటు జత చేయాలి. ఆపై తరగతులు చదివేవారు విద్యా సంస్థల ప్రిన్సిపాళ్ల సర్టిఫికెట్లు అందజేయాలి. వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోచ్చు. 5 కిలోమీటర్ల పరిధి నుంచి 50 కిలోమీటర్ల వరకు రాయితీ పాసులను అందిస్తోంది. గతంలో నెలకోసారి విద్యార్థులు పాసులను రెన్యూవల్ చేసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు మూడు నెలల వరకు కూడా అవకాశం ఉంది.

రాయితీ పాసుల రుసుం వివరాలివీ..

దూరం (కి.మీ.)	నెలకు (రూ.లలో)	3 నెలలకు (రూ.లలో)
0-5	140	400
5-10	190	555
10-15	240	705
15-20	310	930
20-25	400	1,185
25-30	435	1,290
30-35	475	1,410
35-40	565	1,680
40-45	645	1,920
45-50	735	2,190



ఎమ్మెల్యే బేబీనాయనకు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

నాడు రాజులకు.. నేడు ప్రజలకు
దర్బార్ మహల్

- 'దయచేసి మీ పని త్వరగా ముగించుకొని ఇతరులకు అవకాశం కల్పించండి'
- బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన పెట్టిన బోర్డు ఇదీ

బొబ్బిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి కోట అంటే చరిత్రాత్మకమైనది. అందులోకి అడుగు పెట్టాలంటే అప్పట్లో జనం గుండెల్లో దడ. రాజులు, రాజ్యాలు అంతరించిపోయాయి. నేడు ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్న రోజులు. అలనాడు రాజుల కాలంలో ప్రజల సందర్శన కోసం 'దర్బార్ మహల్' ఉండేది. ఇప్పటికీ అది అలాగే ఉంది. కాకపోతే ఇప్పుడు ప్రజల దర్బార్ మహల్‌గా మారిపోయింది. రాజవంశీయుడు, ప్రస్తుత ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన).. ప్రజలు నేరుగా తనను కలుసుకొని సమస్యలు చెప్పుకునేందుకు ఆ దర్బార్ మహల్‌లో ఏర్పాటు చేశారు. బొబ్బిలి నియోజకవర్గం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో జనం వచ్చి బేబీనాయనకు తమ సమస్యలు వివరిస్తుంటారు. జనం తాకిడి కారణంగా సమయ పాలన పాటించలేకపోవడంతో పాటు.. కొందరికే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. దీంతో ఆయన తన టేబుల్ ముందు ఓ చిన్న బోర్డును ఏర్పాటు చేశారు. దానిపై 'దయచేసి మీ పని త్వరగా ముగించుకొని ఇతరులకు అవకాశం కల్పించండి' అని రాయించారు. దీన్ని చూసిన ప్రజలు తొందరగా తమ పనులు ముగించుకొని... అక్కడి నుంచి బయలుదేరుతున్నారు.

కోటదుర్గమ్మకు సారె సమర్పణ

పాలకొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవత కోటదుర్గమ్మ అమ్మవారి ఆషాఢ మాసం సారె సంబరం మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులకు శాకంబరి దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు లక్ష్మీ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 500 మంది మహిళలు అమ్మవారికి చీరలు, పువ్వులు, గాజులు, పసుపు కుంకుమ, అరిసెలు, లడ్డూతో పాటు రెండు వందల రకాల మిఠాయిలు కానుకగా అందించారు. ఈవో సూర్యనారాయణ బంగారు ఆభరణాలతో పూజా సామగ్రిని కోటదుర్గమ్మకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



శాకంబరీదేవిగా కోటదుర్గమ్మ



శాకంబరిగా దాడితల్లి అమ్మవారు



పూజలు చేస్తున్న భక్తులు

బొబ్బిలిలో...

బొబ్బిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి బైపాస్ జంక్షన్‌లో గల దాడితల్లి అమ్మవారు మంగళవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పిండిప్రోలు మణికుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని పండ్లు, కూరగాయలతో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక బంగారమ్మ ఆలయంలో అర్చకులు ప్రకాశ్ పండా ఆధ్వర్యంలో శాకంబరి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించిన అనంతరం ఆఖరి రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తామని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

గోరపాడు సమీపంలో ఏనుగులు

సీతంపేట రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో గిరిజనులకు ఏనుగుల బెడద వదలడం లేదు. గత నెల 16న భామిని మండలం నుంచి సీతంపేట మన్యంలోకి ప్రవేశించిన గజరాజులు గిరిజనుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మంగళవారం గోరపాడు, మోహన కాలనీ గ్రామాల మధ్య సంచరించాయి. గిరిజన రైతులకు చెందిన జీడితోటల్లో తిష్ఠ వేశాయి. జీడిచెట్లను ధ్వంసం చేసినట్లు గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలిస్తేనే తమకు, పంటలకు రక్షణ ఉంటుందని పేర్కొంటున్నారు. మరోవైపు అటవీ శాఖ అధికారులు ఏనుగుల గమనాన్ని ప్రతి రోజు పర్యవేక్షిస్తూ గిరిజనులను అప్రమత్తం చేస్తున్నారు.



జీడితోటలో ఉన్న ఏనుగులు



కిరణా షాపులో తనిఖీ చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ప్రమాదాలకు కారణమైన
వాహనాలను గుర్తించండి

- కేసుల విచారణలో నిర్లక్ష్యం వహించవద్దు ● ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో ప్రమాదాలకు కారణమైన (హిట్ అండ్ రన్ కేసులు) వాహనాలను సాధ్యమైనంత త్వరగా గుర్తించాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హిట్ అండ్ రన్ కేసులు, 194 బీఎన్ఎస్ఎస్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర స్థలం నుంచి వాహనం వెళ్లే మార్గంలో అన్ని సీసీ కెమెరాల ఫుటేజీలను, టోల్‌గేట్ రికార్డులను పరిశీలించాలని సూచించారు. నేర సమయంలో వాహనం నిర్లక్ష్యంగా నడిపే వ్యక్తిని, సాక్ష్యాలను గుర్తించి... త్వరితగతిన బాధితులకు పరిహారం అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలను, సంబంధిత పత్రాలను ఆర్డీఓకి పంపాలన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో సమాచారం అందిన వెంటనే రోడ్ సేఫ్టీ చెక్‌పోస్టులను, వాహనాలను, సరిహద్దు పోలీసు స్టేషన్లను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి, ఎల్.అప్పలనాయుడు, సుధాకర్, ఎస్ఐలు పాల్గొన్నారు.

విద్యా సంస్థల సమీపంలో ఖైనీలు విక్రయిస్తే చర్యలు..

జిల్లాలో విద్యా సంస్థలకు సమీపంలోని 100 మీటర్ల పరిధిలో సిగరెట్లు, ఖైనీలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. మంగళవారం ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ పేరుతో విద్యా సంస్థల సమీపంలోని పాన్‌షాపులు, కిరణా షాపులలో ఎస్పీ వకుల్ జిందాల్ స్వయంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థల సమీపంలో మత్తు కలిగించే చాక్లెట్స్ వంటి వస్తువులను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలోని బాలాజీ నగర్‌లో తనిఖీలు చేపట్టి... 15 షాపుల్లో సిగరెట్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసి జరిమానా విధించామని ఎస్పీ తెలిపారు. ఈ తనిఖీలలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు శ్రీనివాస్, లీలారావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి, ఎస్ఐలు ప్రసన్నకుమార్, రామ్‌గణేష్, ఎస్బీ, ఈగల్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మా.. నాన్నా.. బడికి రండి

- ఆహ్వాన పత్రికలు తయారుచేసిన విద్యార్థులు

రాజాం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): 'అమ్మా..నాన్నలకు నమస్కారం. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కోసం ఈ నెల 10న మా బడికి రండి' అంటూ విద్యార్థులు ఆహ్వాన పత్రికలు అందిస్తున్నారు. మెగా పేరెంట్, టీచర్ సమావేశానికి తమ తల్లిదండ్రులతో పాటు గ్రామపెద్దలు, విద్యాశాఖ అధికారులకు ఆహ్వానం పలుకుతూ పెనుబాక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఆహ్వాన పత్రికలను రూపొందించారు. పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు కొండవలస మధుసూదనరావు ఆధ్వర్యంలో విద్యార్థులు వీటిని తయారుచేసి ఇప్పటికే పంపిణీ చేయడం ప్రారంభించారు. విద్యార్థులలోని సృజనాత్మకశక్తిని వెలికితీయడంతో పాటు కార్యక్రమంలో వారిని ప్రత్యక్షంగా భాగస్వాముల్ని చేయాలన్న లక్ష్యంతో ప్రత్యేకంగా కార్డులను తయారు చేయించి... వారితోనే పంపిణీ చేయిస్తున్నట్లు మధుసూదనరావు వివరించారు.



ఆహ్వాన పత్రికలు



ఆహ్వాన పత్రికలు తయారు చేస్తున్న విద్యార్థులు

వసతి గృహాల్లో తనిఖీలు

కురుపాం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల వసతి గృహాలను మంగళవారం మలేరియా స్టేట్ కన్సల్టెంట్ ఎస్.రామచంద్రరావు తనిఖీ చేశారు. కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల వసతి గృహంలో స్ప్రేయింగ్ చేశారో లేదో ఆరా తీశారు. జ్వరాలపై హాస్టల్ వార్డెన్ సూర్యనారాయణతో మాట్లాడారు. సిక్ రూమ్‌లో విద్యార్థులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.



స్ప్రేయింగ్ తీరును పరిశీలిస్తున్న మలేరియా స్టేట్ కన్సల్టెంట్ రామచంద్రరావు

ఉద్యాన పంటలతోనే ఆర్థికాభివృద్ధి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గరుగుబిల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఉల్లిభద్ర డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల ప్రాంగణంలో కొబ్బరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు అదనపు లబ్ధి చేకూరేందుకు వివిధ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ ఏడాది 15 మండలాల పరిధిలో సుమారు 5 వేల ఎకరాల్లో కొబ్బరి మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. చెరువు గట్లు, ప్రాజెక్టు ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాల్లో కొబ్బరి మొక్కలు నాటేందుకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. కొబ్బరితో పాటు వివిధ రకాల పండ్ల మొక్కలు నాటేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. మొక్కల సంరక్షణ బాధ్యతను గ్రామాల పరిధిలోని మహిళా సంఘాలకు అప్పగిస్తామని వివరించారు. మహిళలు వీటి సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలన్నారు. మహిళా సంఘాలకు మొక్కలను ఉచితంగా అందిస్తామని ఆయన తెలిపారు. రైతులు నీటి నిల్వ చేసుకొనేందుకు నీటి కుంటలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో నాటుతున్న మొక్కలను సంబంధిత అధికారులు దత్తత తీసుకోవాలన్నారు. ఒకవైపు మహిళలకు, మరోవైపు రైతులకు అనుగుణంగా ఉండేందుకు ఉపాధి పథకాలను పూర్తిస్థాయిలో విస్తరిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు కె.రామచంద్రరావు, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.రాజేశ్వరి, ఎంపీడీవో జి.పైడితల్లి, ఏపీవో ఎం.గౌరీనాథ్, ఇంజనీర్ తేజేశ్వరరావు, సిబ్బంది ఎం.హరికృష్ణ, ఉమామహేశ్వరి, శ్రీవిద్య, కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, సర్పంచ్ భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కొబ్బరి మొక్క నాటుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

● జిల్లాలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలు

అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమపథకాలు అందుతున్నాయని టీడీపీ నాయకులు తెలిపారు. మంగళవారం జిల్లాలో సుపరిపాలనలో తొలి అడుగుకార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ నాయకులు, ఎమ్మెల్యేలు ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



లక్కవరపుకోట:కొట్యాడలో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి



రాజాం : సోపేరులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



నెల్లిమర్ల: ఒమ్మిలో పథకాల గురించి వివరిస్తున్న బంగార్రాజు, రవిశేఖర్

ప్రసన్నకుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

విజయనగరం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిపై నోరుపారేసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.మహిళలను గౌరవించాలన్న సంప్రదాయం వైసీపీకి లేదని ఆరోపించారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్న వైసీపీ నాయకులపై పార్టీ హైకమాండ్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆమె ప్రశ్నించారు.

●శృంగవరపుకోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) ప్రసన్న కుమార్‌రెడ్డిపై జగన్ చర్యలుతీసుకోకపోవడం మహిళలను అవమానించడమేనని ఎమ్మెల్యే లలితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయాల్లోకి మహిళలను లాగే నీచమైన సంస్కృతి వైసీపీతోనే మొదలైందని పేర్కొన్నారు.

ప్రజలకు కంప్యూటరైజ్డ్ సేవలు

విజయనగరం రింగురోడ్డు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇక నుంచి పూర్తి పారదర్శకంగా కంప్యూటరైజ్డు మెంటెన్స్ మేనేజ్‌మెంట్ విధానంలో సేవలందిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య తెలిపారు.మంగళవారం నగర పాలక సంస్థకార్యాలయంలో సచివాలయ కార్యదర్శులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన విధి విధానాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వాట్సాప్‌గవర్నెన్స్ ద్వారా సులభతరమైన రీతిలో పౌరసేవలు అందించేందుకు ఏర్పాటు చేసిందన్నారు. సమావేశంలో ఈఈ ప్రసాద్, ఎంహెచ్‌ఓ డాక్టరు సాంబమూర్తి, డీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి

కొత్తవలస, జూలై 8 (ఆంధ్రజ్యోతి) :ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ కోరారు. మంగళవారం మంగళవారంలో జాతీయ డెంగ్యూ మాసోత్సవాలు పురస్కరించుకుని అవగాహన ర్యాలీని నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సత్యారావు, జగదాంబ, పద్మావతి, ఈశ్వరరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావాలి

శృంగవరపుకోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి):ప్రజలకు మంచి చేయడంకోసం పార్టీని వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావాలని కార్యకర్తలను జిల్లా వైసీపీ అధ్యక్షుడు, జడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కోరారు. మంగళవారం శృంగవరపుకోటలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధ్యక్షతన నియోజకవర్గ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి పురస్కరించుకుని విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, శోభాస్వాతిరాణి, నాయకులు నెక్కల నాయుడు బాబు పాల్గొన్నారు.

జేజేఎం పనుల పరిశీలన

వేపాడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఓబలయ్యపాలెం, పాటూరుల్లో జేజేఎం మిషన్ ద్వారా నిర్మిస్తున్న పైపులైన్, కొళాయి పాయింట్ల పనులను విజయనగరం క్వాలిటీ కంట్రోల్ డీఈఈ రమణ ప్రబాత్ పరిశీలించారు. కార్యక్రమంలో లక్కవరపుకోట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పైడిరాజు క్వాలిటీ కంట్రోల్ ఏఈలు రాజేష్, కార్తీక్,జేఈ దేవి పాల్గొన్నారు.

నివేదిక తయారు చేయాలి

భోగాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీల పురోగతి నివేదికలు పక్కాగా తయారు చేయాలని ఎంపీడీవో కిషోర్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో పంచాయతీల పురోగతి నివేదికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నివేదిక తయారీపై కార్యదర్శి సీహెచ్ అచ్చుతరావు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గాయిత్రి, ఏవో కామేశ్వరరావు పాల్గొన్నారు.

●వేపాడ,జూలై 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పురోగతి సూచిక అనే అంశంపై సచివాలయ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీహెచ్ సూర్యనారా యణ కోరారు. మంగళవారం పంచాయతీ పురోగతి సూచిక అన్న అంశంపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలకు తొమ్మిది కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో,మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంచి ప్రభుత్వానికి అండగా ఉండాలి

● చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు



లవిడాంలో రోడ్డును ప్రారంభిస్తున్న కళావెంకటరావు

గుర్ల, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రజలు మంచి ప్రభుత్వానికి అండగా ఉండాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు కోరారు.వైసీపీనాయకులు తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని లవిడాం గ్రామంలో సీసీరోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది వైసీపీ నాయకులు అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కేటీఆర్, వెన్న సన్యాసినాయుడు, కిరణ్‌కుమార్,సీహెచ్ మహేశ్వరరావు, దాసరి శివప్రసాద్, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయం

● రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

రాజాం/ రూరల్, జులై 8 (ఆంధ్రజ్యోతి):బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తోందని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు.రాజాం మునిసిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు నేలమట్టమై నిరాశ్రయులుగా మిగిలిన బత్తిన సరోజిని కుటుంబాన్ని ఎమ్మెల్యే మంగళవారం పరామర్శించారు.ఈ సందర్భంగా బియ్యం, నిత్యావసరాలతో పాటు రెడ్‌క్రాస్ అందజేసిన వంటపాత్రలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కోండ్రు జగదీష్, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, మరిపి జగన్మోహనరావు, గంధి గోపి, పద్మశ్రీ పాల్గొన్నారు.

●రాజాం, జులై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచరాం సమీపంలో డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు కోసం జీఎంఆర్ స్థలాన్ని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. కార్యక్రమలో జీఎంఆర్ పీఏ రెడ్డి అన్నాంనాయుడు,టీడీపీనాయకులు నారాయణరావు, శ్రీనివాసరావు, జయరాం, వెంకటరమణ. వెంకటరావు, శాసపు రాజేష్‌కు మార్ పాల్గొన్నారు సోపేరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. సోపేరులో మొక్కలు నాటారు.

మొక్కల పెంపకానికి ప్రాధాన్యం

కొత్తవలస, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలను పెంచేందుకు ప్రాధాన్యం ఇస్తోందని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని ఉత్తరాపల్లి గ్రామంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ అధికారులతో కలసి మొక్కలను నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకు కాలుష్యం పెరిగిపోతోందని, పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించాలంటే మొక్కలను విరివిగా పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఎం జనార్దనరావు, నాయకులు కోళ్ల వెంకటరమణ, గొరపల్లి రాము, రత్నాజీ పాల్గొన్నారు.

●లక్కవరపుకోట, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న మేలుజాతి పండ్ల మొక్కలు, కూరగాయలను వేసుకొని మంచి ఆదాయాన్ని పొందవచ్చునిఎమ్మెల్యే లలితకుమారి తెలిపారు. మండలంలోని కొట్యాడలో ముక్కా మల్లునాయుడు పొలంలో పండ్లతోట మొక్కలు నాటారు.కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.అప్పారావు, ఏపీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



భోగాపురం: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

భోగాపురం, జూలై8 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి పిలుపునిచ్చారు. పండ్ల మొక్కలు పెంపకంతో రైతులకు ఆర్థికంగా ప్రయోజనం పొందవచ్చుని తెలిపారు. మంగళవారం మండలంలోని గాబువానిపాలెంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.

●డెంకాడ, జులై 8(ఆంధ్రజ్యోతి):పర్యావరణ పరిరక్షణలో అందరం భాగస్వాములం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. మండలంలోని పేడాడ గ్రామంలో మంగళవారం హార్టికల్చర్ ప్లాంటేషన్‌కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు పల్లె భాస్కరరావు, సంఘం సురేష్, బి.రవికుమార్, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మండల జనసేన పార్టీ కోఆర్డినేటర్ పైలా శంకర్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల, జూలై 8(ఆంధ్రజ్యోతి): మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని తంగుడుబిల్లి, ఏటీ.అగ్రహారం, ఒమ్మి గ్రామాల్లో టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

మత్తు పదార్థాల స్వాధీనం

● జిల్లాలో ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ పేరుతో తనిఖీలు

జిల్లాలోని పలుచోట్ల దుకాణాల్లో ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిషేధిత మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

రాజాం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి):రాజాంలోని పలు పాన్‌షాపుల్లో డీఎస్పీ రాఘవులు సారథ్యంలో టౌన్ సీఐ అశోక్‌కుమార్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు.ఈసందర్భంగా పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు.

●గజపతినగరం, జూలై8(ఆంధ్రజ్యోతి):గజపతినగరంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రాంగణాల్లో గల పాన్‌షాపులపై సీఐ జీఏవీ రమణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు షాపుల్లో సిగరెట్ల అమ్మకాలు చేపట్టినట్లు గుర్తించి కోప్టా యాక్టు కింద అపరాధ రుసుము విధించినట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ కేకేకే నాయుడు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి సన్యాసిరావు, రమేష్ కుమార్ పాల్గొన్నారు.

●చీపురుపల్లి, జులై 8(ఆంధ్రజ్యోతి):పాన్ షాపులు, కిరాణ దుకాణాల వర్తకులు వ్యాపార నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎస్.రాఘవులు హెచ్చరించారు. చీపురుపల్లిలో విద్యాసంస్థలకు వంద మీటర్ల దూరంలో ఉన్న ల దుకాణాలను ఎస్ఐ ఎల్.దామోదరరావుతో కలిసి తనిఖీ చేశారు.

●గుర్ల, జూలై 8(ఆంధ్రజ్యోతి): గుర్లలోని స్కూళ్లు, కాలేజీలకు వంద మీటర్ల దూరంలో ఉన్న పాన్‌షాపులను పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిగిరెట్స్, బీడీలు, చుట్టలు విక్రయించిన వారికి అవగాహన కల్పిస్తూ ఫైన్ వేశారు.



చీపురుపల్లి: పాన్‌షాపులో తనిఖీ నిర్వహిస్తున్న డీఎస్పీ రాఘవులు

●రేగిడి, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంగరాడమెట్టలో గల షాపుల్లో మాదకద్రవ్యాలు, టుబాకా వినియోగం, నిల్వలపై ఎస్ఐ నీలావతి, సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. దుకాణాలు, స్టాక్‌రూమ్‌లు పరిశీలించి, మాదకద్రవ్యాల వినియోగం, చట్టపరమైన చర్యలపై దుకాణదారులకు అవగాహన కల్పించారు.

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు తగవు

గజపతినగరం, జూలై8 (ఆంధ్రజ్యోతి): జడ్పీచైర్మన్ చిన్న శ్రీను ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు పేర్కొన్నారు.గజపతినగరంలో మాజీ ఎంపీపీ గంట్యాడశ్రీదేవితో కలిసి మాట్లాడుతూ మంత్రిని ఏకవచనంతోసంబోధించడం ఎంతవరకు సమంజసమన్నారు.కార్యక్రమంలో సభ్యుడు ముక్కువశ్రీధర్, ప్రదీప్, గోవింద పాల్గొన్నారు.

●జామి,జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటికే ఉనికి కోల్పోయిన వైసీపీ నాయకులు అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని వెలమకార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శి పోడుపురెడ్డి స్వామినాయుడు, వర్రి రమణ పేర్కొన్నారు. కొండపల్లి శ్రీనివాస్ అనుక్షణం జిల్లా అభివృద్ధికి పాటుపడుతున్నారని అటువంటి వ్యక్తిపై లేనిపోని ఆరోపణలు జిల్లా పరిషత్ చైర్మన్ చేయడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని తెలిపారు.

●దత్తిరాజేరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధినిచూసి ఓర్వలేక వైసీపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం దత్తిరాజేరులో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం ఎవరు సేవచేశారు ఎవరు దోచుకున్నారో జిల్లా ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు.అవినీతి గురించి మాట్లాడుతున్న మజ్జిశ్రీనివాసరావు కుటుంబ చరిత్ర ఎంతో, జిల్లాలో ఆయన కుటుంబం ఏం చేసిందో ఎవరిని అడిగినా చెబుతారన్నారు. కార్యక్రమంలో క్లస్టర్‌ఇన్‌చార్జ్‌లు బోడసింగిసత్తిబాబు, మిత్తిరెడ్డి ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు వంగపండు కృష్ణమూర్తి, మజ్జి మహేష్‌లు పాల్గొన్నారు.

● గంట్యాడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) సేవభావంతో పనిచేసే వ్యక్తులపై అవినీతి అంటించే విధానం వైసీపీ నాయకులు మానుకోవాలని టీడీపీ నాయకులు హితవు పలికారు గంట్యాడలోని టీడీపీనాయకులు కొండపల్లి భాస్కర్‌నాయుడు, అల్లు విజయ కుమార్, బూడి అప్పలనాయుడు, రంధిచినరామునాయుడులు విలేకరులతో మాట్లాడారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు.

●బొండపల్లి, జూలై8(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం ఏడాదిపాలనలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వస్తున్న ప్రజాభిమానం చూసి ఓర్వలేకనే జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్యలు లేనిపోని ఆరోపణలు చేసి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఏఎంసీ వైస్‌చైర్మన్ కోరాడకృష్ణ పేర్కొన్నారు. బొండపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు అమలు అవుతున్న సమయంలో వైసీపీని,ఆపార్టీ నాయకులను ప్రజలు మరచిపోతారనే భయంతోనే అవాకులు, చవాకులు పేలుతున్నారని విమర్శించారు.

పీ-4పై చౌకబారు విమర్శలు మానుకోండి

● మంత్రి శ్రీనివాస్‌పై వ్యాఖ్యలు తగవు ● టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

విజయనగరం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ-4 కార్యక్రమాన్నిచంద్రబాబు ఏర్పాటు చేసి, దానిపై ప్రత్యేక దృష్టి సారించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున తెలిపారు. అటువంటి కార్యక్రమం గురించి ఎమ్మెల్సీ బొత్స, చిన్న శ్రీనులు కనీసం అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ఇటువంటి చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవుపలికారు.మంగళవారం విజయనగరం టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జడ్పీ చైర్మన్ జిల్లాలో అవినీతి సామ్రాట్‌లన్న విషయం ఎవరిని అడిగినా చెబుతారన్నారు. 2019-24 కాలంలో కోట్లాది రూపాయలు వీరు దోచుకున్నారన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురించి వీరిద్దరూ మాట్లాడడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఆయన విజన్ ఉన్న నాయకుడన్నారు. తొలిసారి ఎమ్మెల్యే, మంత్రిగా ఆయన గజపతినగరం నియోజకవర్గం, జిల్లాను ముందుకు నడిపించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అటువంటి ఆయనపై ఎమ్మెల్సీ బొత్స జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను విమర్శించడం తగదన్నారు. ఏడాది పాలనలో సూపర్‌సిక్స్‌లో ఇప్పటికే కొన్ని హామీలు అమలయ్యాయని, వచ్చేనెలఖరులోగా సూపర్‌సిక్స్‌లో మరికొన్ని హామీలు అమలు కానున్నాయన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, ప్రసాదరావు,పాణిఫణీరాజు, బంగారుబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగార్జున

ప్రత్యామ్నాయం లేక.. అగచాట్లు తప్పక

● సాయన్నగెడ్డపై వంతెన కూలడంతో నిలిచిపోయిన రాకపోకలు

రేగిడి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రేగిడి, సంతకవిటి మండలాల సరిహద్దులోని కొండగూడెం- మాధవరాయపురం మధ్య ఉన్న సాయన్నగెడ్డపై ఉన్న వంతెన కూలిపోయినా రాకపోకలకు అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేదు.దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు అగచాట్లకు గురయ్యారు. ఈ మార్గంలో రేగిడి, సంతకవిటి మండలాల్లోని పలుగ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు.ఇక్కడ ప్రత్యామ్నయచర్యలు తీసుకోకపోవడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు మరోమార్గంలో మళ్లించాల్సివస్తోంది. పక్కనుంచి రహదారి ఏర్పాటుచే యకపోవడంతో ఖండ్యాం, సోమరాజుపేట మీదుగా చుట్టూ తిరిగివెళ్లాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు.దీంతో ఈరూట్లో ఉన్న రేగిడి మండలం ఖండ్యాం, వన్నలి, ఉప్పరనాయుడువలస, ఖండ్యాంతో పాటు సంతక విటి మండలంలోని జావాం, కేఆర్‌పురం, కొండగూడెం, మాధవరాయపురం తదితర 20 గ్రామాల ప్రజలు అవస్థలకు గురవుతున్నారు.



వంతెన కూలిపోయిన దృశ్యం

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి

రామభద్రపురం, జూలై8(ఆంధ్రజ్యోతి): ఆరికతోట-భూసాయవలస గ్రామాల మధ్య జాతీయరహదారిపై మంగళవారం వ్యాన్ ఢీకొని ఒకరు మృతిచెందారు. పాచిపెంట మండలం కర్రివలసకు చెందిన పడాల సంతోష్(25)ను విజయనగరం నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొంది. తీవ్ర గాయాలతో యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సంతోష్‌కు ఐదు నెలల కిందటే వివాహమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చికిత్సపొందుతూ వృద్ధుడు..

దత్తిరాజేరు,జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరడాం గ్రామ రెవెన్యూ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన దివ్యాంగ వృద్ధుడు చికిత్సపొందుతూ మృతిచెందాడు. స్టేషన్ బూర్జవలస పోలీసుల కథనం మేరకు.. మెంటాడ మండలంలోని కుంటినవలస గ్రామానికి చెందిన చుక్క సత్యం (69) మరడాంగ్రామంలో పనుల నిమిత్తం వెళ్లాడు. సోమవారం రాత్రి తిరుగుప్రయాణంలో తనవాహనంపై వస్తుండగా ఎదురుగా వచ్చిన అదేగ్రామానికి చెందిన వ్యక్తి ద్విచక్రవాహనంతో ఢీకొన్నాడు. దీంతో సత్యంకు తలకు బలమైన గాయాలు కావడంతో 108లో గజపతినగరం సీహెచ్‌సీకితరలించారు.చికిత్సపొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

29 మద్యం సీసాల స్వాధీనం

రాజాం జూలై 8 (ఆంధ్రజ్యోతి) అనధికార మద్యం దుకాణాలపై డేగనున్న వేశామని, సర్కిల్ పరిధిలోని ఒక్క వంగర మండలంలోనే 19 కేసులు నమోదుచేశామని ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఆర్ జైభీమ్ తెలిపారు. వంగర మండలంలోని కొట్టిశ గ్రామానికి చెందిన అమరాన వెంకటరావు, కల్లూరి గవరయ్య, నూరి పోలిరాజులు 29 మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తుండగా మంగళవారం స్వాధీనంచేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

దాడికి పాల్పడిన ముగ్గురు అరెస్టు

కొత్తవలస, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దాడికి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి కొత్తవలస కోర్టులో హాజరుపరచగా 14 రోజులు పాటు జ్యూడిషియల్ కస్టడీలో ఉంచాలని న్యాయాధికారి ఆదేశాలు జారీచేశారని ఎస్ఐ హేమంత్‌కుమార్ తెలిపారు. విశాఖకు చెందిన బీశెట్టి సాయిచంద్ మరోఇద్దరు తుమ్మికాపల్లి జనార్దన్‌నగర్ సమీపంలో ఉన్న ఓ రెస్టారెంట్ వద్ద ఉండగా ఈనెల ఐదో తేదీన కొత్తవలస ఎస్సీ కాలనీకి చెందిన ముగ్గురు వ్యక్తులు వారితో గొడవపడ్డారు. ఈ గొడవలో సాయిచంద్‌ను కొట్టి గాయపరిచారు. ఈ మేరకు సాయిచంద్ తల్లి బీ.శెట్టి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తవలస ఎస్సీ కాలనీకి చెందిన కడగల రఘు, నాని, ఓ.హేమంత్ సాయిలపై సీఐ షణ్ముఖరావు కేసునమోదు చేశారని చెప్పారు. నిందితులు ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా న్యాయమూర్తి జ్యుడిషియల్ కస్టడీకి పంపించినట్లు తెలిపారు.

డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా సావిత్రి

విజయనగరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా సావిత్రి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పీడీగా బాధ్యతలు నిర్వహించిన కళ్యాణ చక్రవర్తి పదోన్నతిపై సెర్ప్ డైరెక్టరుగా బదిలీపై వెళ్లారు.దీంతో సావిత్రి ఇన్‌చార్జి పీడీగా బాధ్యతలు స్వీకరించారు. సావిత్రిని డీఆర్‌డీఏ సిబ్బంది అభినందించారు.

ఆశా కార్యకర్తలకు వేతనాలు పెంచాలి

రాజాం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తల వేతనాలను పెంచాలని, వారి న్యాయపరమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక కార్యదర్శి రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు.మంగళవారం రాజాంలోని పట్టణ అర్బన్ సెంటర్ ప్రాంగణంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏళ్లుగా విధులు నిర్వహిస్తూ కనీసవేతనాలు, ఉద్యోగభద్రతకు నోచుకోని ఆశవర్కర్లు హక్కులసాధనకు ఉద్యమించాలని కోరారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

విజయనగరం క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ట్రాఫిక్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేసిన పి.శ్రీనివాసరావు కుటుంబానికి సిబ్బంది అండగానిలిచారు.ఇటీవల మృతిచెందడంతో సిబ్బంది ఒక్కరోజు డ్యూటీ అలవెన్స్‌కు సంబంధించి 3 లక్షల 23 వేల 050 చెక్కును శ్రీనివాసరావు సతీమణి లక్ష్మీప్రసన్నకు ఎస్పీ వకుల్‌జిందాల్ అందజేశారు.కుమారుడిని హోంగార్డుగా నియమించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, హోంగార్డు ఇన్‌చార్జి ఆర్ఐ రమేష్‌కుమార్, డీపీవో సూపరిడెంటెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు: ఏడీ

పూసపాటిరేగ,జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవశాయశాఖ ఏడీ నాగభూషన్‌రావు హెచ్చరించారు.మంగళవారం మండలంలోని పేరాపురం వద్ద గల వెంకటేశ్వర ట్రేడర్స్, నాయుడు ట్రేడర్స్, సీరామ ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను పరిశీలించారు



పూసపాటిరేగ: ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీ నాగభూషణ్

●కొత్తవలస, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో శ్రీమోదమాంబ ఆగ్రోఫెర్టిలైజర్స్‌కు సంబంధించిన షాపును విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలుచేశారు. షాపులో ఎరువులు ఉండాలసిన నిల్వ కంటే 67 బస్తాలు తక్కువగా ఉండడంతో ఏవో రాంప్రసాద్ షాపు యజమాని గొంప అప్పలనాయుడుపై 6ఏ కేసు నమోదు చేశారు. షాపులో ఉన్న సీజ్ చేసిన స్టాక్ విలువ లక్షా 12 వేల 96 రూపాయలు అని విజిలెన్స్ అధికారి సింహాచలం తెలిపారు పురుగుల మందుల రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంతో అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు.

●సంతకవిటి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు, ఎరువులు కృత్రిమ కొరత సృష్టించడంతో పాటు, అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని ఏవో సీబీయశ్వంత్‌రావు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

●రాజాం జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయించినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని ఏవో చీకటి రఘునాథ్ హెచ్చరించారు.రాజాంలో సాయిబాబా, ఆంజనేయ ట్రేడర్స్‌లో ధరలు పట్టికలను పరిశీలించారు. బస్తాపై ఉన్న ధరకంటే ఎక్కువకు అమ్మకాలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వైఎస్‌ఆర్‌కు నివాళి

డెంకాడ, జూలై 8(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజలగుండెల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారని నెల్లిమర్ల మాజీఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుతెలిపారు. డెంకాడలో వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకొని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రొంగలి కనక సింహాచలం, తమ్మునాయుడు, గౌరి పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతి నుంచైనా మంచి పనులు చేయండి

(ఐదో పేజీ తరువాయి)

పాల్పడే వారి భరతం పడుతున్నామని, నేరస్తుల ఆస్తులను అటాచ్ చేస్తున్నామన్నారు. ఎస్.కోటలో రూ.3 కోట్ల ఆస్తులను అటాచ్ చేసినట్లు తెలిపారు.

వర్క్ ఫ్రమ్ ఓదార్పు నిర్వహిస్తున్న జగన్

బెట్టింగ్‌లకు పాల్పడి ఆత్మహత్య చేసుకున్నవారి విగ్రహాలను ఏడాది తరువాత ఏర్పాటు చేయడం, మందీ మార్బలంతో ఓదార్పు యాత్రలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని, జగన్ ఇటీవల వర్క్ ఫ్రమ్ ఓదార్పు నిర్వహించి తమ ఇంటికే బాధితులను రప్పించి ఓదార్చుతున్నారన్నారు. ఇది సిగ్గుచేటని, అనంత్‌బాబు కేసు విషయంలో కనీసం స్పందించని జగన్ ఇపుడు వింత పోకడలు చేస్తున్నారని విమర్శించారు.

బొబ్బిలి స్టేషన్‌కు సిబ్బందిని నియమిస్తాం

బొబ్బిలి పట్టణానికి, మండలానికి ఒకే పోలీసు స్టేషన్ ఉండడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ఎమ్మెల్యే పలు దఫాలు తన దృష్టికి తెచ్చారని హోంమంత్రి అని చెప్పారు. పోలీసుస్టేషన్‌ను కచ్చితంగా విస్తరించి, తగిన సిబ్బందిని నియమిస్తామన్నారు.

ఇది బేబీనాయన నియోజకవర్గం

బొబ్బిలిలో తనకు లభించిన అపూర్వ ఆదరణకు మంత్రి అనిత ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఇది బొబ్బిలి నియోజకవర్గం కాదని, బేబీనాయన నియోజకవర్గమని అభివర్ణించారు. మహిళలు తనను ఎంతగానో ఆదరించారని, సొంత ఆడబిడ్డ మాదిరిగా చూడడం ఆనందం కలిగించిందన్నారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బేబీనాయన, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున, టీడీపీ సీనియర్ నేత అల్లాడ భాస్కరరావు, మడక తిరుపతినాయుడు, కర్రోతు తిరుపతిరావు, వాసిరెడ్డి సత్యనారాయణ, మహిళా నేతలు కింతలి శ్రీదేవి, వెలగాడ హైమావతి, సాలా స్వప్నదేవి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య కళాశాల విద్యార్థులకు తీపికబురు

(ఐదో పేజీ తరువాయి)

అందజేశారు. విద్యార్థులకు న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల క్రితం విద్యార్థులకు స్టైఫండ్‌ను పెంచుతూ జీవో విడుదల చేసింది. తాజాగా కేంద్రప్రభుత్వం కూడా తరగతులకు అనుమతులు ఇచ్చినట్టు సమాచారం. అయితే ఇంకా కళాశాలకు అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ఇదే విషయాన్ని కళాశాల డీన్ ఎం.శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా తాము కూడా సమాచారం విన్నామని, ఇంతవరకు లిఖితపూర్వకంగా ఎటువంటి ఆదేశాలు రాలేదని చెప్పారు. ఒకటి రెండు రోజుల్లో వచ్చే అవకాశం ఉందన్నారు.

వేతన యాతన

(ఐదో పేజీ తరువాయి)

సిల్ట్‌ట్రాప్, ఇన్‌లెట్, ఔట్ లెట్ పూర్తి అయినవి 1924 ఉన్నాయి. మొత్తం 238 పూర్తి అయినట్లు అధికార గణంకాలు వెల్లడిస్తున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 25 నుంచి 100 శాతం ఫామ్‌పాండ్స్ పూర్తి చేసినవారు 501 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. వీరందరికీ వేతనాలు అందాయి. 25 శాతం మాత్రమే చేసిన వారు 156 మంది, అసలు ఫామ్‌పాండ్స్ తవ్వని వారు 119 మంది ఉన్నారు. ఈ రెండు కేటగిరీలకు చెందిన 275 మందికి వేత నాలు నిలిపివేశారు. కాగా ఫామ్‌పాండ్స్ తవ్వడానికి రైతులు ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితిలో అనుకున్న స్థాయిలో క్షేత్రస్థాయిలో లక్ష్యాలు పూర్తి కావడం లేదు. మరోవైపు ప్రసుత్తం కురుస్తున్న చిరుజల్లుల వల్ల కూడా ఫామ్‌పాండ్స్ తవ్వడానికి అనుకూలం కాదని, ఈ కారణంతో లక్ష్యాలు పూర్తి చేయలేకపోతున్నామని క్షేత్ర సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదెక్కడి నిబంధన?

క్షేత్ర సహాయకులను ప్రతి ఏడాది ఏప్రిల్ నెలలో సర్వీసు రెన్యూవల్ చేయాలి. కమిషనర్ మార్గదర్శకాల ప్రకారం ఏడాది కాలంలో ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ 7,500 పని దినాలు (మెన్ డేస్) చేయని వారికి మాత్రమే రెన్యూవల్ ఆపాలని నిబంధనలు చెబుతున్నాయి. ఇలా రెన్యూవల్ కానివారికి జీతాలు నిలుపుదల చేస్తారు. 7,500 పనిదినాలు పూర్తి చేసిన వారికి జీతాలు ఇవ్వాల్సి ఉంది. కాని ఫామ్‌పాండ్స్ పూర్తి చేయని కారణంగా జీతాలు నిలిపేయడం సరికాదని వారంతా వాపోతున్నారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకూ జీతాలు మంజూరు చేయలేదు. దీనిపై వారు నాలుగు రోజులు క్రితం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇదే విషయమై డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శారదాదేవి వద్ద ప్రస్తావించగా ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు ప్రతి క్షేత్ర సహాయకుడు 25 ఫామ్‌పాండ్స్ తవ్వాలని చెప్పామని, కొందరు కనీస స్థాయిలో తవ్వించలేదని, అయినా అందరికీ విడతల వారీగా వేతనాలు ఇవ్వడానికి చర్యలు తీసుకున్నామన్నారు.

కస్తూర్బా పాఠశాలలో మళ్లీ అగ్ని ప్రమాదం

(ఐదో పేజీ తరువాయి)

అగ్నిప్రమాదం జరగడంతో విద్యార్థినుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఆ ప్రమాదం మొదటి అంతస్తులోని స్టాక్ రూంలో సంభవించగా అదే గది కింది రూంలో ఈ అగ్నిప్రమాదం జరిగింది. రాత్రి 8.30 గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరగడంతో విద్యార్థినులు పరుగులు పెట్టారు. తరచూ ప్రమాదాలు జరగడానికి గల కారణాలు తెలియరావడం లేదు. ఈ ప్రమాదం విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో జరిగిందా? మరే ఇతర కారణామా? ఇంకా స్పష్టత లేదు.

డ్రోన్ చూస్తోంది

(ఐదో పేజీ తరువాయి)

నేరాలను అదుపు చేస్తోంది. డ్రోన్‌లతో పోలీసుశాఖ ఎన్నో సత్ఫలితాలు సాధిస్తోంది.

● ఆధునిక డ్రోన్‌లో డ్యూయల్ కెమరా వ్యవస్థ ఉంది. రెండు కెమెరాలతో ఒకేసారి భిన్న కోణాల్లో ఫొటోలు, వీడియోలు తీయొచ్చు. ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ కోసం వీటిని రూపొందించినప్పటికీ పోలీస్ శాఖకు ఓ బ్రహ్మాస్త్రంగా ఉపయోగపడుతోంది.

● జిల్లాలోని మూడు సబ్ డివిజన్లకు నాలుగు డీజేఐ ఎయిర్-3 డ్రోన్లను కేటాయించారు. ధర్నాలు, ఆందోళనలు, బహిరంగ సభలు, సమావేశాలు, వివాదాలను చిత్రీకరించడానికి వీటిని వినియోగిస్తున్నారు. బహిరంగ సభల్లో ఉత్సవాల్లో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, జాతరలో చేతి వాటాల కట్టడికి కూడా ఉపయోగపడుతున్నాయి.

● ఈ డ్రోన్‌లు కిలోమీటరు ఎత్తు వరకూ ఎగురుతూ 2 లేదా 3 కిలోమీటర్ల విస్తీర్ణంలో జరిగే సంఘటనలు సైతం గుర్తిస్తాయి. సాంకేతికతతో అక్కడ ఎంత మంది వున్నారో లెక్కిస్తాయి. పగలు రాత్రీ కూడా ఫొటోలు తీయగలవు.

● పది మంది పోలీసు సిబ్బంది పనిచేయాల్సిన చోట ఒక డ్రోన్ పనిచేయగలుగుతుంది. పోలీసులకు సమయంతో పాటు తక్కువ సిబ్బంది సరిపోతున్నారు.

నేరాల నియంత్రణలో డ్రోన్‌లు కీలకం..

ప్రధాన కూడళ్లల్లో ట్రాఫిక్ సమస్యలు, జన సంచారం లేని ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ సమావేశాలు, ఉత్సవాల్లో డ్రోన్‌లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. నేరాలను నియంత్రించేందుకు దోహదపడుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రతి స్టేషన్‌కు ఒక డ్రోన్ కేటాయించి నేరాల నియంత్రణకు కృషి చేస్తాం. ఇప్పటికే ఐదు సబ్ డివిజన్లలో ఐదు ప్రధాన కేంద్రాల్లో డ్రోన్‌లను వినియోగిస్తున్నాం. పలు కేసులు ఛేదించాం.

-ఎస్పీ వకుల్ జిందాల్

మినీ అంగన్వాడీలకు మహర్దశ

(ఐదో పేజీ తరువాయి)

అంగన్వాడీ కేంద్రాలు మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ కానున్నాయి. ఫలితంగా కార్యకర్తలకు పదోన్నతి దక్కనుంది.

జిల్లాలో 2499 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 2206 మెయిన్ అంగన్వాడీ కేంద్రాలు కాగా, 293 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. మెయిన్ అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్తతో పాటు ఆయా పనిచేస్తారు. మినీ అంగన్వాడీ కేంద్రాల్లో ఒకరు మాత్రమే పనిచేస్తారు. మెయిన్ అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్తకు రూ.11,500, ఆయాకు రూ.7వేలు వేతనంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. వీటితో పాటు ప్రభుత్వ నియమ, నిబంధనల మేరకు కొన్ని సౌకర్యాలు, రిటైర్మెంట్ బెనిఫిట్లు కూడా వర్తిస్తున్నాయి. అయితే మినీ అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేసే కార్యకర్తకు మాత్రం ప్రభుత్వం రూ.7 వేలు వేతనంగా చెల్లిస్తోంది. వీరికి ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్లు లేవు. ఆయాకు చెల్లించే వేతనంతోనే మినీ అంగన్వాడీ కార్యకర్త కాలం వెల్లదీయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయాలని వారంతా గత ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వచ్చారు. వీరి వేదనను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మార్చేందుకు నిర్ణయించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో మినీ అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

293 మంది కళ్లల్లో ఆనందం..

జిల్లాలోని 293 మినీ అంగన్వాడీ కేంద్రాలు మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మారనున్నాయి. ఫలితంగా ప్రతి కేంద్రానికీ ఆయాను సైతం ప్రభుత్వం నియమించనుంది. ఫలితంగా కేంద్రాల నిర్వాహకులపై పని ఒత్తిడి తగ్గనుంది. వేతనాలు, సౌకర్యాలు పెరగనున్నాయి. ఆయాను సైతం నియమించడంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతల పట్ల కేంద్రాల నిర్వాహకులు ప్రత్యేకశ్రద్ధ కనబరిచేందుకు అవకాశాలున్నాయి.

మంత్రి ప్రకటించారు..

మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రకటించారు. దీంతో ఆయా కేంద్రాల కార్యకర్తల్లో ఆనందం నెలకొంది. ప్రభుత్వం ఈ దిశగా అప్‌గ్రేడ్ చేస్తే జిల్లాలో 293 మినీ అంగన్వాడీ కేంద్రాలు మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మారతాయి. ఆయా కేంద్రాలకు ఆయాల నియామకం కూడా జరుగుతుంది.

-విమలారాణి, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఐసీడీఎస్, విజయనగరం

బొబ్బిలిలో తొలి అడుగుకు ఆదరణ

● హోం మంత్రి అనితకు అపూర్వ స్వాగతం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న హోం మంత్రి అనిత

బొబ్బిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని 17 వ వార్డులో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. ఎన్నికల ప్రచారం మాదిరిగా సందడిగా, ఆర్భాటంగా జరిగింది. ఎమ్మెల్యే బేబీనాయన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హోం మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున ఇతర పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తొలుత బొబ్బిలి కోటకు చేరుకున్న మంత్రికి పార్టీ ప్రముఖులు ఘనస్వాగతం పలికారు. పోలీసు వందనం స్వీకరించిన తరువాత ఆమె వార్డులో పర్యటనకు వెళ్లారు. వార్డు కౌన్సిలర్ కింతలి శ్రీదేవి బంగార్రాజు దంపతుల ఆధ్వర్యంలో తెలుగు మహిళలు, పార్టీ ఇన్‌చార్జిలు గజమాల, మేళతాళాల ఆమెకు స్వాగతం పలికారు. పార్టీ రూపొందించిన ఏడాది పాలన ప్రగతి సమాచారంతో కూడిన కరపత్రాలను ఆమె పంపిణీ చేశారు. అనంతరం బొబ్బిలి కోటలో వేదపండితులు మంత్రికి ఆశీర్వచనాలు అందజేశారు. బొబ్బిలి వీణ, చీరలనుఆమెకుఎమ్మెల్యే బేబీనాయన బహూకరించారు. దక్షిణభారత మహిళా హక్కుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ చింతా శారద ఆధ్వర్యంలో పలువురు మహిళలు మంత్రికి హారతులిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, పట్టణ, మండల పార్టీల అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, వాసిరెడ్డి సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, సీనియర్ నేతలు అల్లాడ భాస్కరరావు, సుంకరి సాయిరమేష్, కాకల వెంకటరావు, మహిళా నేతలు వెలగాడ హైమావతి, సాలా స్వప్నదేవి, బీసపు పార్వతి తదితరులు పాల్గొన్నారు. బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి ఆధ్వర్యంలో సీఐలుకటకం సతీష్‌కుమార్, నారాయణరావు, ఎస్ఐ రమేష్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

అంకితభావంతో పనిచేయండి

బలిజిపేట, జూలై8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ఆశా వర్కర్లు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ జగన్మోహనరావు సూచించారు.ఆశా డే సందర్భంగా మంగళవారం బలిజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధులను నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. పాఠశాల విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి వాటి వివరాలు పీహెచ్‌సీకి అందజేయాలన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంవో సన్యాసిరావు, బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి క్రాంతి కిరణ్మయి, ఈవో పాల్గొన్నారు.

పంచాయతీ సమగ్ర అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

బొబ్బిలి రూరల్, జూలై8 (ఆంధ్రజ్యోతి: పంచాయతీల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పంచాయితీ పురోగతి సూచిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీపీ శంబంగి లక్ష్మి అన్నారు. మంగళవారంస్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో పంచాయితీ పురోగతి సూచికపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, ఏఎన్ఎంలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆమెప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రఘువంశీ, ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

●బొబ్బిలి రూరల్: నారాయణప్పవలసకు చెందిన రైతు కె.గాయత్రి పొలంలో మంగళవారం ఎంపీపీ శంబంగి లక్ష్మిజీడి మొక్కలు నాటారు.ఉపాధి హామీ పథకంలో భాగంగా ఆమె మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, ఏపీవో లక్ష్మీపతిరాజు.జడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతికుమారి, ఉద్యానవన శాఖాధికారి సిరిపురపు రత్నం, రైతులు పాల్గొన్నారు.

కండ్ల కలకపై నిర్లక్ష్యం వద్దు

తెర్లాం, జూలై8 (ఆంధ్రజ్యోతి): కంటకల కలకపై నిర్లక్ష్యం వద్దని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు పెద్దింటి వంశీకృష్ణ అన్నారు. ఆశా డే సందర్భంగా మంగళవారం ఆయన ఆశా వర్కర్లతో సమవేశం నిర్వహించారు. సమావేశంలో పెరుమాళి అప్తాల్మిక్ అధికారి ఎస్.వసంతరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల కారణాంగా కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. దీనిపైఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు.కంటి శుక్లాల ఆపరేషన్లకు మోటివేషన్ చేసిన విజయరాంపురం, రంగప్పవలస ఆశా వర్కర్లు రామలక్ష్మి, సత్యవతిలను సత్కరించారు.కార్యక్రమంలో వైద్యురాలు రెడ్డి స్వాతి,ప్రభావతి జాగృతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎస్.వసంతరావు పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తిచేయండి

సాలూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని ఆర్పీలను పీడీ చిట్టిరాజు ఆదేశించారు. మంగళవారం పట్టణంలో ఆర్పీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యఘర్ లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు. బ్యాంకు లింకేజీ తీసుకున్న ప్రతీ వ్యక్తికి కూడా జీవనోపాధి ఏర్పాటు చేసుకుని అధిక అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. ప్రతీ సంఘానికి ఆడిట్ చేయించాలన్నారు.హోం కంపోస్టు తయారీ, కిచెన్ గార్డెన్, టెర్రస్ గార్డెన్‌పై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్ కృష్ణ, గోవిందరావు, డీఆర్పీ వెంకటరమణ తదితరులు హాజరయ్యారు.

దుకాణాల్లో విస్తృత తనిఖీలు

బొబ్బిలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలల పరిసరాలలో మంగళవారం బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ పేరిట విస్తృత తనిఖీలు నిర్వహించారు. పాన్‌షాపుల్లో టొబాకో, గంజాయి ఉత్పత్తుల తనిఖీలు నిర్వహించారు. కొన్ని షాపుల్లో పొగాకు ఉత్పత్తులు అమ్ముతున్నట్లు గుర్తించారు. 20 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. డీఎస్పీ వెంట సీఐ కటకం సతీష్‌కుమార్, ఎస్ఐ ఆర్.రమేష్, ఎస్‌బీ హెచ్‌సీ కండి చిన్నారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పోలీసులు తనిఖీలు చేపడుతున్నారన్న సమాచారం తెలుసుకొని పలువురు వ్యాపారులు అప్రమత్తమయ్యారు.

పోగొట్టుకున్న పర్సు అందజేత



పర్సు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

సాలూరు రూరల్, జూలై8 (ఆంధ్రజ్యోతి): బస్సు ప్రయాణంలో పోగొట్టుకున్న పర్సును సంబంధిత ప్రయాణికుడికి మంగళవారం సాలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ బీఎస్ఎస్ మూర్తి అందజేశారు. ఉద్దవోలు నుంచి బొబ్బిలి వెళ్లే ఆర్టీసీ బస్సులో నారంన్నాయుడువలసకు చెందిన పబ్బిశ నారాయణరావు ఈనెల 6న ప్రయాణించారు. ఆయన బొబ్బిలిలో హడావుడిగా దిగిపోయారు. అతని నగదు పర్స్ బస్సులో పడిపోయింది. ఆ పర్సులో రూ. 9168 నగదు ఉంది. పలు కార్డులు ఉన్నాయి. ఆ పర్స్ బస్ కండక్టర్ వీఆర్‌కేవీ రావుకు దొరికింది. దీంతో పర్సును ఆయన సాలూరు డిపోలో అప్పగించారు. పర్స్‌లోని కార్డులు ఆధారంగా ఆయనకు ఫోన్ చేశారు. మంగళవారం నగదుతో సహా పర్సును డిపో మేనేజర్ అందజేశారు. నిజాయితీ చాటుకున్న కండక్టర్ వీఆర్‌కేవీ రావును డీఎం అభినందించారు.

బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ

బొబ్బిలి రూరల్, జూలై8 (ఆంధ్రజ్యోతి): యోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో బీఎల్‌వోలకు స్థానికమండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం నుంచిశిక్షణ తరగతులు నిర్వహించనున్నామని ఈ ఆర్‌వో గౌరీశంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతులకు ప్రతీ బీఎల్‌వోలు విధిగా హాజరు కావాలని, ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శిక్షణ ఉంటుందన్నారు. ప్రతిరోజూ సా యం త్రం 4 గంటలకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

భూసేకరణపై బహిరంగ విచారణ



విచారణకు హాజరైన డిప్యూటీ కలెక్టర్, అధికారులు

బొబ్బిలి రూరల్, జూలై8 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి రాయిపూర్ వరకూ హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్ ప్రాజెక్ట్ కోసం భూసేకరణపై మంగళవారం బొబ్బిలి మండల రెవెన్యూ కార్యాలయంలో అధికారులు బహిరంగ విచారణ చేపట్టారు. ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుధాసాగర్ ఆధ్వర్యంలో రైతుల నుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించారు. హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్ ఏర్పాటుకు భూమి యజమానులకు ప్రభుత్వం ఇదివరకే నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఉమ్మడి జిల్లాల్లో 18 మీటర్ల వెడల్పుతో 165 కిలోమీటర్ల మేర భూమి సేకరించాలని నిర్ణయించారు. పైపులైన్ల కోసమే కాకుండా మధ్యలో పంపింగ్, ఫిల్లింగ్ స్టేషన్లు, సెక్షన్ల వారీగా వాల్వు స్టేషన్లు కూడా ఏర్పాటు చేస్తారు. ఇందుకుగానూ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని రైతులు, ఇతర భూములు కొంతమేర కోల్పోవాల్సి వస్తోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బహిరంగ విచారణలో పరిహారం పంపిణీ విధానం, ఇతర సంబంధిత సమాచారం అందించామని హెచ్‌పీసీఎల్ చీఫ్ మేనేజర్ జి.కిశోర్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ ఎం.లక్ష్మణ్ తెలిపారు. భూ యజమానులకు మార్కెట్ ధరకు 4 రెట్లు పెంచి పరిహారం ఇచ్చేందుకు నిర్ణయించామన్నారు. అందులో 10 శాతం పరిహారం అందజేస్తామన్నారు.పండ్ల తోటలు, చెట్లు జీవిత కాలాన్ని లెక్కించి పరిహారం నిర్ణయిస్తామన్నారు. విచారణలో తహసీల్దార్ జి.ఆదినారాయణ, రైతులు, పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

బలిజిపేట, జూలై8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలపల్లి రైతు భరోసా కేంద్రం ఎదుట మంగళవారం రైతులు యూరియా కోసంఆందోళనకు దిగారు.ఈ సందర్భంగా రైతులు ఎ.కృపారావు, ఉమామహేశ్వరరావు, బి.వెంకటి, మురళీ తదితరులు మాట్లాడుతూ రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తులకే యూరియా ఇస్తున్నారు తప్ప సామాన్య రైతులకు ఇవ్వడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా వ్యవసాయశాఖ అధికారులు కలుగజేసుకుని యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు కోరారు.

●రైతులకు అవసరమైన యూరియా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయాధికారి ఎం.శ్రావణ్‌కుమార్ అన్నారు. రైతులంతా యూరియా కోసం ఒకేసారి వెళ్లడంతో అక్కడక్కడా కొరత వస్తోందన్నారు. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. నానో యూరియా, నానో డీఏపీ అందుబాటులో ఉందన్నారు. రైతులు వాటిని కూడా వినియోగించుకుంటే మంచిదని ఏవో సూచించారు.

నాణ్యమైన విద్యాబోధన చేయండి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

బొబ్బిలి రూరల్, జూలై8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు డీఈవో మాణిక్యం నాయుడు సూచించారు. మంగళవారం పెంట జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హజరుపై ఆరా తీశారు. సమయపాలన పాటించాలన్నారు. విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. చదువులో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను ఈసందర్భంగాడీఈవో అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్.లక్ష్మణరావు, హెచ్‌ఎంల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సన్యాసిరాజు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూటమితో సంక్షేమం సాధ్యం

రామభద్రపురం, జూలై8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు అన్నారు. గొల్లలపేట, అప్పలరాజుపేట, శిష్టు సీతారాంపురం గ్రామాల్లో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా పీ4 పథకంలో బంగారు కుటుంబం ద్వారా కుటుంబాలను ఆదుకుంటుందన్నారు. అనంతరం ఇటీవల మృతిచెందిన తెలుగుదేశం కార్యకర్త బాలి ఆదిలక్ష్మి కుటుంబానికి పార్టీ ఇచ్చిన రూ. 5 లక్షల చెక్కును భర్త బాలి రామకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో శిష్టు సీతారాంపురం వైస్ ప్రెసిడెంట్ కర్రోతు అప్పలనాయుడు, శిష్టు సత్యనారాయణ, కర్రోతు వెంకన్న, వెంకటరమణ, అల్లాడ సత్యనారాయణ, బాలి రామకృష్ణ, గుడ్ల తవుడు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడండి

బొబ్బిలి రూరల్, జూలై8 (ఆంధ్రజ్యోతి):భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా రైతులు ఎరువులను ఉపయోగించాలని బొబ్బిలి డివిజన్ ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ అన్నారు. మంగళవారం మండలంలోని కలవరాయిలో భూసార పరీక్షల ప్రాధాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా నేలలోని పోషకాల లోటుపాట్లను తెలుసుకోవచ్చన్నారు. తద్వారా అవసరమైన ఎరువులను మాత్రమే వాడటం వల్ల రైతులకు ఎరువుల ఖర్చు తగ్గుతుందన్నారు. ఖరీఫ్ పంట కాలంలో మొక్కజొన్న పంటకు ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయనతో పాటు వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణం పూర్తి చేయండి

సాలూరు రూరల్, జూలై8 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లిలో అసంపూర్తిగా నిలిచిపోయిన మామిడిపల్లి పీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని సత్వరమే పూర్తి చేయాలని రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర డిమాండ్ చేశారు. ఆయన మామిడిపల్లిలో వైఎస్ఆర్ జయంతి వేడుకల్లో మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తేణాం పీహెచ్‌సీని ప్రారంభించినట్టే మామిడిపల్లి పీహెచ్‌సీ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ గుణవతి, సర్పంచ్ శశికళ, దండి శ్రీనివాసరావు, రామకృష్ణ, పెద్దింటి మాధవరావు, గణేష్, శ్రీనివాసరావు, పరిమళ పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ జయంతి

బొబ్బిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి):దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరెడ్డి అద్భుతమైన పాలన సాగించి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించు కున్నారని బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో వైఎస్ జయంతిని నిర్వహించారు. తొలుత అమ్మిగారి కోనేరు గట్టుపై వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్య క్రమంలో శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు,తూమల అచ్యుతవల్లి, చోడిగంజి రమేశ్‌నాయుడు, బొద్దల సత్యనారాయణ పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితులకు న్యాయం చేయాలి

శృంగవరపుకోట రూరల్, జూలై8 (ఆంధ్రజ్యోతి): జిందాల్ తరపున కాకుండా బాధితుల తరపున కలెక్టర్ మాట్లాడి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ కోరారు. మంగళవారం మండలంలోని బొడ్డవరలో కలెక్టర్ అంబేడ్కర్ తమ గోడును ఎందుకు పట్టించుకోవడం లేదని జిందాల్ నిర్వాసితులు ఆరోపిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ తమ సమస్య పరిష్కారానికి 20రోజులుగా నిరసన చేస్తున్నా ఏ ఒక్క అధికారి, ప్రజాప్రతినిధి పట్టించుకోవడం లేదని వాపోయారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ కలెక్టర్, జిందాల్ యాజమాన్యం స్పందించి సమస్యలు పరిష్కరిస్తారన్న ఆశాభావం వ్యక్తంచేశారు. ●సాగులో ఉన్న భూముల్లో పరిశ్రమ వస్తుందని పేర్కొని తమకు ఇప్పటివరకు పరిశ్రమ నుంచి ఎటువంటి పరిహారం రాలేదని వెంటనే యాజమాన్యం స్పందించి పరిహారం ఇప్పించాలని ఐదుకుటుంబాల గిరిజనులు కోరారు. మంగళవారం తమ భూముల్లో జరుగుతున్న పనుల వద్దకు వారుచేరుకొని నిరసన తెలిపారు. తమ తాత,తండ్రుల కాలంనుంచి సాగుచేసి పండ్లతోటలు వేసుకున్నామని, ఇప్పుడు వీటిని తొలగించి తమకు ఆర్థిక భద్రత లేకుండా చేశారని వాపోయారు.

●శృంగవరపుకోట: జిందాల్ భూసేకరణలో ఇంకా 18మంది రైతులకు పరిహారం అందలేదని వెంటనే వారికి అందించాలని లోక్‌సత్తా నియోజకవర్గ నేత ప్రసాద్ కోరారు.ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు.

ఉన్నత ఆశయాన్ని ఎంపిక చేసుకోండి

విజయనగరం రింగురోడ్డు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత ఆశయాలను ఎంపిక చేసుకోవాలని సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎ.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఎంఆర్ అటానమస్ కళాశాలలో పూర్వ విద్యార్థి, సీఆర్‌పీఎఫ్ ఐజీ శ్రీనివాస్‌ను కళాశాల సిబ్బంది, విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు, కరస్పాండెంట్ కేవీఎల్ రాజు, పి.రాజు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.